సాక్షి
విశాఖపట్నం
మంగళవారం ¤ 14 ¤ మే ¤ 2024

చంద్రంపాలెంలో బారులుదీరిన ఓటర్లు





సాయంత్రం 6 గంటల సమయంలో పెద జాలారిపేటలో వేచి ఉన్న ఓటర్లు



10.24% 20.47% 34.75% 47.66% 59.39%

విశాఖ పార్లమెంట్ పరిధి

రాత్రి 10 గంటల వరకు పోలింగ్ శాతం

68.13%



↑ స్వర్ణభారతి స్టేడియంలోని పోలింగ్ కేంద్రానికి ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధురాలు

↓ ఏయూ హైస్కూల్ కేంద్రంలో



ఓటెత్తారు

- ఉదయం నుంచి రాత్రి వరకూ నడలని సంకల్పం
- ఉత్సాహంగా ఓటేసిన మహిళలు, వృద్ధులు
- గంటల తరబడి లైన్లో వేచి ఉండి ఓటు హక్కు వినియోగం
- సమయం మించిపోయినా కదలని ఓటరు
- జోరువానలోనూ అదే జోరు
- పలు చోట్ల ఆలస్యంగా సాగిన ఓటింగ్



ఓటు వేసేందుకు వేచి ఉన్న వృద్ధులు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఓటు పోటెత్తింది. ఉదయం 7 గంటలకు మొదలైన ఓట్ల ప్రవాహం.. రాత్రి 10 గంటల వరకూ అదే జోరుతో సాగింది. గంటల తరబడి ఓటర్ క్యూల్లో వేచి ఉండి మరీ ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాత్రి వేళలో కొన్ని ప్రాంతాల్లో జోరువానలోనూ ఓటు సంకల్పం సడలలేదు. యువతరం ఉత్సాహాన్ని మించేలా.. వృద్ధులు, మహిళలు, గ్రామీణ ఓటర్లు వెల్లువలా తరలివచ్చారు. తమ తలరాతను మార్చే రథసారథులను ఎన్నుకోవడంలో ఓటర్లు కీలక పాత్ర పోషించారు. ప్రతీ బూత్.. ఓటర్లతో సందడి వాతావరణం కనిపించింది. తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకున్న యువతలో కొత్త ఉత్సాహం కనిపించింది. విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మరింత మెరుగు పడేందుకు.. నిరంతరం ప్రజలతో మమేకవుతున్న నాయకత్వానికే మరోసారి పట్టం కట్టేందుకు మొగ్గు చూపినట్లు ట్రెండ్ కనిపించింది. పోలింగ్ కేంద్రం వద్ద సెల్ఫీలు తీసుకునేందుకు చిన్నా.. పెద్దా పోటీపడ్డారు. పలు బూత్‌ల వద్ద ఎన్నికల సంఘం సెల్ఫీ స్టాండ్లను ఏర్పాటు చేసింది. మొత్తంగా, విశాఖ పార్లమెంట్ పరిధిలో సోమవారం రాత్రి 10 గంటల వరకు 68.13 శాతం , అనకాపల్లి జిల్లాలో 70.45 శాతం, అల్లూరి జిల్లాలో 63.09 శాతం పోలింగ్ నమోదైంది.

పోలింగ్ సరళి కొనసాగిందిలా..

ప్రతీ ఎన్నికల్లో ఉదయం, సాయంత్రం పోలింగ్ శాతం అధికంగా నమోదవుతుంది. మధ్యాహ్నం సమయంలో పోలింగ్ మందకొడిగా సాగుతుంది. అయితే ఈ సారి ఎన్నికల్లో మాత్రం మధ్యాహ్నం కూడా ఎక్కడా ఓటింగ్ శాతం తగ్గిపోలేదు. మండు టెండలోనూ ఓటర్లు తమ హక్కును ఉపయోగించుకోవడం కనిపించింది. విశాఖ పార్లమెంట్ పరిధిలో ఉదయం 9 గంటలకు 10.24 శాతం, 11 గంటలకు 20.47, ఒంటి గంటకు 34.75, 3 గంటలకు 47.66 శాతం నమోదైంది. అంటే మధ్యాహ్న సమయంలో సుమారు 13 శాతం పోలింగ్ నమోదు కావడం గమనార్హం. ఇక 5 గంటల సమయానికి 59.39 శాతానికి పెరిగింది. విశాఖ పార్లమెంట్ పరిధిలో తుది సమాచారం మేరకు 68.13 శాతం నమోదైంది. అల్లూరి జిల్లాలో ఉదయం 9 గంటలకు 6.73 శాతంతో మందకొండిగా మొదలై 11 గంటలకు 18.07 శాతానికి చేరుకుంది. ఒంటి గంటకు 32.75 శాతం, 3 గంటలకు 48.67 శాతం... సాయంత్రం 4 గంటలకు 53.62 శాతంగా నమోదైంది. సాయంత్రం 4 గంటలకు పోలింగ్ సమయం ముగియగా.. తుది సమాచారం మేరకు 63.09 శాతం నమోదైంది. అనకాపల్లి జిల్లాలో ఉదయం 9 గంటలకు 8.47 శాతం పోలింగ్‌తో నెమ్మదిగా నమోదై.. 11 గంటలకు 19.97 శాతానికి చేరుకుంది. ఆ తర్వాత ఒక్కసారిగా గేర్ మారింది. మధ్యాహ్నం ఒంటి గంటకు ఏకంగా సగానికిపైగా పోలింగ్ పూర్తయి 53.45 శాతం నమోదైంది. తర్వాత 3 గంటలకు 58.11 శాతం, సాయంత్రం 5 గంటలకు 69.3 శాతానికి చేరి.. మొత్తంగా 70.45 శాతం పోలింగ్ నమోదైంది. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగిసింది. అయితే, అప్పటికే ఓటింగ్ కోసం లైన్‌లో ఉన్న వారందరికీ అవకాశం ఉండటంతో రాత్రి వరకూ ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. మరోవైపు సాయంత్రం ఉరుములు, మెరుపులతో ప్రారంభమైన వర్షం సైతం ఓటర్ల సంకల్పాన్ని చెక్కు చెరపలేకపోయింది. ఒకవైపు వర్షంతో కరెంట్ సరఫరా నిలిచిపోయి.. ఓటింగ్‌కు ఆలస్యమవుతుందని తెలిసినప్పటికీ.. ఓటర్లు వేచి ఉండి మరీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రధానంగా మహిళలు, వృద్ధులు వెనుదిరగకుండా క్యూలో ఉండి మరీ ఓటు వేశారు.



చంద్రంపాలెం కేంద్రంలో...



ఆరిలోవ ఆఖరి బస్టాప్ వద్ద...

పోలింగ్ ఆలస్యం

విశాఖ జిల్లాలో పలు చోట్ల పోలింగ్ ఆలస్యమైంది. ఓటరు లైన్‌లో దాదాపు 3 నుంచి 4 గంటలు వేచి చూసే పరిస్థితి కనిపించింది. ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో ఓటర్లు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని గోపాలపట్నం, భీమిలిలోని మధురవాడ, పెందుర్తిలోని అక్కిరెడ్డి పాలెం పోలింగ్ బూత్‌లలో ఓటింగ్ మందకొడిగా సాగింది. ప్రతి ఓటరు 2 నుంచి మూడు గంటల పాటు క్యూలో నిలబడ్డాడు. ఎన్నికల కమిషన్ చేసిన ఏర్పాట్లపై ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు.

ఏజెన్సీలో ప్రశాంతంగా..

అల్లూరి సీతారామరాజు జిల్లాలో సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో జిల్లా యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. గతంలో ఎన్నడూ లేనంతగా పోలీసు బలగాలను మోహరింపు చేశారు. ఏజెన్సీ వ్యాప్తంగా పోలింగ్ స్టేషన్లలో ఈవీఎంలు మొరాయించడం, కొన్ని చోట్ల వర్షం కురిసినా ఓటు వేసేందుకు గెడ్డలు దాటి ప్రజలు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. కొన్ని చోట్ల సాంకేతిక కారణాల వల్ల కొంతసేపు ఇబ్బంది కలిగినా సిబ్బంది త్వరితగతిన పరిష్కరించడంతో యథావిధిగా పోలింగ్ జరిగింది. మన్యంలో మునుపెన్నడూ లేనంతగా ఓటింగ్ జరిగింది. అందరి అంచనాలను పటాపంచలు చేస్తూ భారీగా ఓటింగ్‌కు పోటెత్తారు. సాయంత్రం కురిసిన వర్షాన్ని సైతం పట్టించుకోకుండా గిరిజనులు ఓటు వేశారు. మారేడుమిల్లి మండలం గుర్తేడు ప్రాంతంలో పోలింగ్ అనంతరం ఈవీఎంలను హెలికాప్టర్‌లో రంపచోడవరంలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. గూడెం కొత్తవీధి మండలం కప్పకొండ గ్రామస్తులు గుర్రాలపై దుప్పలవాడ పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో 15 కిలోమీటర్ల మేర ప్రయాణం చేసి కూడా ఓటు హక్కును వినియోగించుకున్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన కుంకుపూడిలో తొలిసారిగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన భూసిపుట్టు, రంగబయలు, బుంగాపుట్టు పంచాయతీల పరిధిలో భారీ గ్రేహౌండ్స్ పోలీసు బలగాల మధ్య ఓటింగ్ జరిగింది. బుంగాపుట్టు పంచాయతీ పరిధిలో 19 గ్రామాలకు చెందిన 1,313 మంది ఓటర్లకు లక్ష్మీపురం పోలింగ్ కేంద్రంలో అవకాశం కల్పించారు. వీరందరినీ నాలుగు జీపుల్లో అధికారులు పోలింగ్ కేంద్రానికి తరలించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన ఏజెన్సీలో ఎటువంటి ఘటనలు లేకుండా ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది.

రాత్రి 10 గంటల వరకు పోలింగ్ శాతం	
భీమిలి	71.14
విశాఖ తూర్పు	68.50
విశాఖ దక్షిణ	62.64
విశాఖ ఉత్తర	61.52
విశాఖ పశ్చిమ	65.05
గాజువాక	64.93
పెందుర్తి	65.24
ఎస్.కోట	83.15
చోడవరం	76.70
మాడుగుల	73.64
అనకాపల్లి	78.96
యలమంచలి	61.46
పాయకరావుపేట	67.03
నర్సీపట్నం	64.93
అరకు	55.85
పాడేరు	45.78
రంపచోడవరం	59.25





ఓటు వేసేందుకు ఉత్సాహంగా వస్తున్న వృద్ధులు, దివ్యాంగులు





ప్రశాంతంగా పోలింగ్

- కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున
- ఓటుహక్కును వినియోగించుకున్న అధికారులు, రాజకీయ ప్రముఖులు



ఓటు హక్కు వినియోగించుకున్న యువతులు

మహారాణిపేట: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. సోమవారం ఉదయం 7 గంటలకు జిల్లా వ్యాప్తంగా పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. అక్కడక్కడ ఈవీఎంల్లో స్వల్ప అవాంతరాలు తలెత్తగా, వెంటనే అధికారులు స్పందించి సరిచేశారు. జిల్లా వ్యాప్తంగా 1991 పోలింగ్ కేంద్రాల్లో తొలుత పోలింగ్ మందకొడిగా ప్రారంభమైనా.. ఆ తరువాత జోరందుకుంది. ఉదయం 6 గంటల ఉంచి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరి ఉన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఆదేశాల మేరకు ఉదయం 5.30 గంటలకే చాలా పోలింగ్ కేంద్రాల్లో మాక్ పోలింగ్ ప్రక్రియ పూర్తి చేశారు. ఎండను దృష్టిలో ఉంచుకొని అన్ని పోలింగ్ కేంద్రాల్లో నీడ కోసం టెంట్లు వేశారు. తాగునీరు, బయో టాయిలెట్లు, వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. పలు చోట్ల అంగన్‌వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో చిన్నపిల్లల సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల కోసం 1,000 వీల్ చైర్లు అందుబాటులో ఉంచారు. అంధుల కోసం అభ్యర్థుల జాబితాలను బ్రెయిలీ లిపిలో పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచటం విశేషం. జిల్లాలోని మొత్తం 11 మోడల్ పోలింగ్ కేంద్రాల్లో మరిన్ని అదనపు హంగులు ఏర్పాటు చేశారు.

కంట్రోల్ రూమ్ నుంచి కలెక్టర్ పర్యవేక్షణ

కలెక్టర్ ఎ.మల్లికార్జున కలెక్టరేట్‌లోని ఎన్నికల కంట్రోల్ రూమ్ నుంచి పోలింగ్ ప్రక్రియను రోజంతా పర్యవేక్షించారు. వెబ్ కాస్టింగ్ ద్వారా, ఆర్వో ద్వారా పోలింగ్ బూత్‌ల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వచ్చారు. అవసరమైన మేరకు ఆదేశాలను జారీ చేసి పోలింగ్ సిబ్బందిని నడిపించారు. ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అధికార యంత్రాంగాన్ని కలెక్టర్ సమష్టిగా నడిపించారు.



కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

కేంద్రాలను సందర్శించిన పరిశీలకులు

ఎన్నికల సాధారణ పరిశీలకుడు అమిత్ శర్మ, పోలీసు పరిశీలకుడు అమిత్‌కుమార్, వ్యయ పరిశీలకుడు రెంగరాజన్, ఇతర నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు అక్తా జైన్, సౌమ్య పాండే జైన్ సోమవారం జిల్లా వ్యాప్తంగా పర్యటించారు. పోలింగ్ తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు.

ఏయూ రిసెప్షన్ సెంటర్లకు పోలింగ్ సామగ్రి

మహారాణిపేట: పోలింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి పోలింగ్ సామగ్రి ఆంధ్రా యూనివర్సిటీలోని రిసెప్షన్ సెంటర్లకు చేరుకుంటున్నాయి. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏడు రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి బస్సుల్లో సామగ్రిని తీసుకొచ్చి, ఆయా నియోజక వర్గాలకు చెందిన కౌంటర్లకు అందజేశారు. పోలింగ్ ప్రక్రియను పరిశీలించిన అనంతరం కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఏయూ ఇంజినీరింగ్ కళాశాలకు చేరుకుని రిటర్నింగ్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు.



ఏయూ రిసెప్షన్ సెంటర్‌లో ఏర్పాట్లపై ఆరా తీస్తున్న జేసీ మయూర్ అశోక్



పోలింగ్ సామగ్రిని ఏయూ రిసెప్షన్ సెంటర్‌కు తీసుకొస్తున్న సిబ్బంది

ఓటేసి బాధ్యత నెరవేర్చారు



మల్లయ్యపాలెం పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



మారికవలస పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి

మధురవాడ: మధురవాడ మల్లయ్యపాలెం పోలింగ్ కేంద్రంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి సోమవారం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ప్రజలంతా బాధ్యతగా తరలి వచ్చి ఓటు వేయడం మంచి పరిణామన్నారు. ఓటర్లు ఎండలో, తగిన తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నట్టు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. అధికార యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు పోతిన హనుమంతురావు, నాయకులు కుడితి రామారావు, వంకాయల మారుతీ ప్రసాద్, జగ్గపిల్లి నరేష్, అల్లాడ లింగేశ్వరరావు, అల్లాడ వెంకటరావు, బగాది లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

జీవీఎంసీ 5వ వార్డు మారికవలసలోని ఆర్‌జీకే పోలింగ్ కేంద్రాన్ని వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా బొత్స ఝాన్సీ మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు పోలింగ్ కేంద్రాల్లోకి పార్టీ కండువాతో ప్రవేశించి ఓటర్లను ప్రభావితం చేశారని, అతనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐదో వార్డు అధ్యక్షుడు పోతిన హనుమంతురావు పాల్గొన్నారు.



చినవాల్తేరులోని కోటక్ స్కూల్‌లో ఓటు వేసిన కలెక్టర్ మల్లికార్జున



జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని 210వ పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న కమిషనర్ సాయికాంత్ వర్మ




ఏయూ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో సతీసమేతంగా ఓటు వేసిన జీవీఎంసీ ఏడీసీ కె.ఎస్.విశ్వనాథన్



మింది జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఓటు వేసిన మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కుటుంబ సభ్యులు



27వ వార్డు రాజేంద్రనగర్ టీవీఎస్ రావు శ్రీకృష్ణా విద్యామందిర్ 216వ బూత్ నంబర్‌లో తల్లి అమ్మాజీ, కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసిన వైఎస్సార్ సీపీ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్



మారుతీనగర్‌లోని 176 పోలింగ్ కేంద్రంలో ఓటేసిన కె.కె.రాజు



మర్రిపాలెం రైల్వే హైస్కూల్‌లో ఓటు వేసిన ఆదారి ఆనంద్ కుమార్



తూర్పు నియోజకవర్గంలోని బూత్ నంబర్ 279లో ఓటు హక్కు వినియోగించుకున్న ఎంపీ గొల్ల బాబూరావు



లాసెన్స్ బే కాలనీ శాంతి ఆశ్రమంలో ఓటు వేసిన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ, ఆయన సతీమణి నాగజ్యోతి



భీమిలిలోని సీబీఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాల పోలింగ్ బూత్‌లో ఓటు వేసిన భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



పెందుర్తి మండలం రాంపురంలో ఓటు వేసిన అదీప్‌రాజ్ దంపతులు



పెదగదిలిలో ఓటు వేసిన నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి దంపతులు, కుమారుడు



మధురానగర్‌లోని 166 బూత్‌లో ఓటు వేసిన 14వ వార్డు కార్పొరేటర్ కటారి అనిల్‌కుమార్ రాజు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన కాలు విరిగిపోయింది. అంబులెన్స్‌లో సీతంపేటలోని మధురానగర్ వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఫ్లెక్సీ కలకలం



పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన బీజేపీ ఫ్లెక్సీని తొలగిస్తున్న సిబ్బంది

సీతంపేట: ఓటమి భయంతో బీజేపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజు ఎన్నికల నిబంధనలు తుంగలో తొక్కారు. పోలింగ్ కేంద్రం వద్ద ఎంపీ అభ్యర్థి భరత్ ఫొటో, తన ఫొటోతో ఉన్న ఫ్లెక్సీని ఏర్పాటు చేయడం సోషల్ మీడయాలో కలకలం రేపింది. దీనికి సంబంధించిన పోస్ట్ సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. ఎన్నికల వేళ.. ఓట్లు అడుక్కోవడానికి ఇటువంటి పనులకు పాల్పడటం అనుచితమని నెటిజన్లు విమర్శించారు. ఆ తర్వాత అధికారుల చొరవతో సిబ్బంది ఫ్లెక్సీని తొలగించారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.73,250
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.67,150
వెండి(కిలో):	రూ.90,000

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.130
స్కిన్	: రూ.270
స్కిన్‌లెస్	: రూ.280

ప్రజాస్వామ్యానికి పచ్చ బ్యాచ్ తూట్లు

ఓటమి భయం కూటమి నేతల కుతంత్రాలకు తెరతీసింది. బీజేపీ, టీడీపీ, జనసేన నేతలు అడుగడుగునా ఎన్నికల కోడ్‌ను అతిక్రమించారు. ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తూ ధన, అనుచర బలంతో పేట్రేగిపోయారు. దబ్బులు వెదజల్లి సీటు దక్కించుకున్న కూటమి ఎంపీ అభ్యర్థి రమేష్ గత నెల రోజుల నుంచీ చేస్తున్న అరాచకాలను పోలింగ్ రోజైన సోమవారం మరింత ఎత్తుకు తీసుకెళ్లారు. పోలింగ్ ప్రారంభానికి ముందే మొదలైన ఈ దారుణాలను పోలింగ్ పూర్తయ్యే వరకూ కొనసాగించారు. పోలీసులు, అధికారులు కూడా భయపడ్డ పరిస్థితి.

- అడుగడుగునా ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు
- సీఎం రమేష్ ఓవరాక్షన్.. పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఎన్నికల ప్రచారం
- టీడీపీ ఏజెంట్లతో ఫొటో షూట్
- క్యూలో నిల్చున్న ఓటర్లకు ప్రలోభాల ఎర

సాక్షి, అనకాపల్లి: ప్రజాస్వామ్యయుతంగా జరగాల్సిన ఎన్నికల్ని కూటమి నేతలు తమ అరాచకాలతో పలు చోట్ల ఓటర్లను భయాందోళనకు గురిచేశారు. పోలింగ్ బూత్‌ల వద్ద క్యూలో ఉన్న ఓటర్లను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా తన అనుచరులతో పోలింగ్ బూత్‌ల్లోకి నేరుగా సెల్‌ఫోన్‌లతో ప్రవేశించిచారు. టీడీపీ ఏజెంట్లతో ఫొటోలు దిగారు. జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారులపై దూషణలకు పాల్పడ్డారు. పార్టీ కండువాలతో పోలింగ్ బూత్‌ల్లో ప్రవేశించి ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ ఓట్లు వేశారు. ఓటర్ స్లిప్‌లతో పాటు టీడీపీ మేనిఫెస్టో పంపిణీ చేస్తూ అడుగడుగునా నిబంధనలకు తూట్లు పొడిచారు.

సీఎం రమేష్ ఓవరాక్షన్

బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడమే కాకుండా పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల ప్రచార కేంద్రంగా మార్చేశారు. మాడుగుల నియోజకవర్గం దేవరాపల్లి మండలం కాశీపురం ప్రభుత్వ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌కు మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఆయన వెళ్లారు. క్యూ లైన్‌లో ఉన్న ఓటర్లను కలిసి బీజేపీకి ఓటేయాలంటూ ప్రలోభాలకు గురిచేశారు. పోలింగ్ బూత్‌లో ఉన్న టీడీపీ ఏజెంట్లతో ఫొటో షూట్‌కు దిగారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ ఓటింగ్ ప్రక్రియకు ఆటంకం కల్గిస్తున్న ఆయన్ని లోపలికి రానించడంతోపాటు, ఎన్నికల సిబ్బంది సకల గౌరవ మర్యాదలు చేయడం, వంగి వంగి నమస్కారాలు పెట్టడం గమనార్హం. అనంతరం దేవరాపల్లి హైస్కూల్ పోలింగ్ బూత్ వద్ద కూడా ఇదే విధంగా ఆయన వ్యవహరించారు. వారి అనుచరులతో పోలింగ్ బూత్‌లోకి చొరబడి ఓటింగ్ ప్రక్రియకు ఆటకం కలిగించారు.

బూతుల అయ్యన్న

ఎప్పుడూ ఏదో ఒక వివాదంతో ప్రజల ఛీత్కాలు ఎదుర్కొనే మాజీ మంత్రి, టీడీపీ నర్సీపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి అయ్యన్నపాత్రుడు పోలింగ్ రోజూ తన నోటి దురుసును ప్రదర్శించారు. నర్సీపట్నం టౌన్ గర్ల్స్ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో ఎన్నికల అధికారులను బండ బూతులు తిడుతూ రెచ్చిపోయారు. రాయడానికి వీల్లేని తిట్లందుకున్నారు. దీంతో అధికారులు నివ్వెరపోయారు. ఆ బూతులు విని ఓటర్లు అయ్యన్నను అసహ్యించుకున్నారు. ఓటేసేందుకు లైన్లలో నిరీక్షిస్తున్న మహిళల ముందే ఈయన ఈ బూతుల్ని అందుకున్నారు.



పోలింగ్ బూత్‌లో గంటా ప్రచారం



టీడీపీ కార్యకర్తలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఎస్పీ

టీడీపీ కండువాతో గంటా హల్‌చల్

తగరపువలస: భీమిలి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు పోలింగ్ రోజున కూడా ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కారు. ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్‌తో కలిసి సోమవారం టీడీపీ కండువా వేసుకుని ఆనందపురం మండలంలోని పలు పోలింగ్ బూత్‌ల్లో ప్రచారం చేశారు. ఎన్నికల నియమావళిని అనుసరించి పోలింగ్ బూత్ చుట్టుపక్కల ఇళ్లపై వైఎస్సార్ సీపీ జెండాలు తొలగించిన ఎన్నికల సిబ్బంది.. గంటా పచ్చ కండువాతో పోలింగ్ బూత్‌ల్లోకి ప్రవేశించినా అడ్డు చెప్పలేదు. పైగా బూత్‌ల్లో, బయట ప్రచారం నిర్వహించిన గంటా సైకిల్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. దీనికి తోడు గుంపుగా బూత్‌ల్లో ప్రవేశించినా.. పోలింగ్ సిబ్బంది గానీ, పోలీసులు గానీ అడ్డుకోలేదు. గంటాతో పాటు అతనికి సహకరించిన పోలీసులు, పోలింగ్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

రెడ్డిపల్లి పోలింగ్ స్టేషన్‌లో..

పద్మనాభం: రెడ్డిపల్లి పోలింగ్ స్టేషన్ వద్ద సోమవారం భీమిలి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు పసుపు కండువాతో హల్‌చల్ చేశారు. తన అనుచరులతో కలిసి గంటా పోలింగ్ స్టేషన్‌లోకి వెళుతుండగా.. వైఎస్సార్ సీపీ శ్రేణులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో కండువాతో వెళ్లడానికి వీల్లేదని వారిని అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. సుమారు 20 నిమిషాల పాటు గంటా శ్రీనివాసరావు లోపలికి వెళ్లకుండా గేటు వద్ద ఉండిపోయారు. చివరకు గంటా కండువా తీసి ఒక్కరే పోలింగ్ స్టేషన్‌లోకి వెళ్లారు.

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి, రిటర్నింగ్ అధికారి హెచ్‌వీ జయరాంలను దూషించి మాట్లాడాడు.

ఓటరు స్లిప్పుల పేరిట మేనిఫెస్టో కాపీలు

ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలో టీడీపీ నేతలు మరింతగా దిగజారారు. ఓటర్ స్లిప్‌లతో పాటు టీడీపీ మేనిఫెస్టోను పంపిణీ చేశారు. భీమిలి నియోజకవర్గంలో మూలకుద్దు, మధురవాడ, సంతపేట అంబేడ్కర్ హైస్కూల్, పెదబొడ్డేపల్లి ఆర్సీఎం స్కూల్, రామారావుపేట, శివపురం తదితర ప్రాంతాల్లో ఓటరు స్లిప్‌తో పాటు టీడీపీ మేనిఫెస్టో పంపిణీ చేశారు. బంగారుమెట్ట మీద దుర్గాలమ్మ ఆలయం వద్ద సూపర్ సిక్స్ ఫ్లెక్సీ పెట్టి ప్రచారం చేశారు. పెదబొడ్డేపల్లిలో మున్సిపల్ వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు నిలదీయడంతో పోలీసులు స్లిప్పులు స్వాధీనం చేసుకున్నారు. రామారావుపేటలో మున్సిపల్ వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకుని ఫిర్యాదు చేశారు. డీఎస్పీ మోహన్ స్వయంగా వచ్చి స్లిప్పులు స్వాధీనం చేసుకుని టీడీపీ కార్యకర్తలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడికక్కడ వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఈ అరాచకాలను అడ్డుకుని, ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినా ఉపయోగం లేకపోయింది.

పార్టీ కండువాతో ఓటింగ్‌కు పంచకర్ల

పెందుర్తి జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్ కూడా నిబంధనల ఉల్లంఘనలో తానేమీ తక్కువ కాదని నిరూపించుకున్నారు. సుజాతనగర్ డీఏవీ పబ్లిక్ స్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఓటేసేందుకు ఉదయం 10 గంటల సమయంలో ఆయన వచ్చారు. పార్టీ కండువాతో పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించిన అతన్ని అధికారులు ఏ మాత్రం అడ్డుకోకపోవడం గమనార్హం.

ఓటర్ల చైతన్యం.. అధికారిపై చర్యలు

ఓటర్లలో చైతన్యం పెరిగింది. వక్రబుద్ధితో వ్యవహరిస్తున్న ఎన్నికల అధికారికి బుద్ధి చెప్పేలా చేశారు. సోమవారం ఉదయం పాయకరావుపేట నియోజకవర్గం, నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు పోలింగ్ బూత్‌లో కళ్లు సరిగా కనిపించని వృద్ధుల ఓట్లను అక్కడి పోలింగ్ అధికారి టీడీపీకి వేయించాడు. ప్రశ్నించిన ఏజెంట్‌పై దురుసుగా ప్రవర్తించాడు. దేవరాపల్లి మండలం ఎ.కొత్తపల్లిలోని పోలింగ్ బూత్ నెం.173లో వృద్ధురాలు ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరగా, పోలింగ్ అధికారి కమలం పువ్వు గుర్తుకు ఓటేశారు. దీన్ని గుర్తించిన 70 ఏళ్ల వృద్ధురాలు నిలదీయడంతో ఏజెంట్లు ప్రశ్నించారు. విషయం ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు కు తెలియడంతో ఆయన అక్కడికి చేరుకుని ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అతన్ని విధుల నుంచి తొలగించి వేరే వారిని నియమించారు.

ఆగని టీడీపీ అరాచకాలు

- దొంగ ఓట్లు వేయించేందుకు తీవ్ర యత్నాలు
- గణబాబు, శ్రీభరత్ చిత్రాలతో స్లిప్‌ల పంపిణీ
- అడ్డుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు
- పోలీసుల వ్యవహార శైలిపై విమర్శలు

గోపాలపట్నం: టీడీపీ నాయకుల అరాచకాలు పోలింగ్ రోజు కూడా కొనసాగాయి. దొంగ ఓట్లు వేయించేందుకు తీవ్ర యత్నాలు సాగించారు. పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లి ఓటర్లను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించారు. అడ్డుకున్న వైఎస్సార్ సీపీనేతలపై దౌర్జన్యానికి దిగారు. గోపాలపట్నం బాలుర ఉన్నత పాఠశాలలో టీడీపీ వ్యక్తి బూత్ లోపలికి వెళ్లి ఓటర్లను ప్రభావితం చేస్తుండడాన్ని గమనించి అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో టీడీపీకి చెందిన కార్యకర్త దాడికి తెగబడ్డాడు. ఇదంతా చూసిన పోలీసులు చూస్తూ ఉండిపోయారే తప్పా ఆ వ్యక్తిని బయటకు పంపించలేదని విమర్శిస్తున్నారు. ఇదే విధంగా లక్ష్మీనగర్ పోలింగ్ బూత్‌లో ఓటు వేసేందుకు వెళ్తున్నానని చెప్పి ఓటు వేయకుండా లోపల క్యూలైన్లో ఉన్న వారిని ప్రలోభాలకు గురి చేసిన టీడీపీ కార్యకర్తను పోలీసుల సాయంతో బయటకు పంపించారు. బుచ్చిరాజుపాలెంలో పలు చోట్ల టీడీపీ అభ్యర్థి గణబాబు, ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ ఫొటోలు ఉన్న స్లిప్‌లు ఓటర్లకు ఇచ్చారు. దీనిపై ఎన్నికల అధికారుల ఫిర్యాదు చేయగా వాటిని తొలగించారు. అధికారులు వెళ్లి పోయిన తర్వాత తిరిగి వాటిని తీసుకు వచ్చి ప్రభావితం చేసేందుకు యత్నించారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు దీన్ని అడ్డుకున్నారు. గతంలో మాదిరిగా దొంగ ఓట్లు వేసే అవకాశం లేకపోవడంతో టీడీపీ నాయకులు గొడవలకు దిగారు.



బుచ్చిరాజుపాలెంలో గణబాబు, శ్రీభరత్ ఫొటోలతో ఓటరు స్లిప్పులు



గోపాలపట్నం హైస్కూల్ వద్ద ఏసీపీతో వాదిస్తున్న బెహరా భాస్కరరావు

టీడీపీ నాయకుడి అత్యుత్సాహం

- నిబంధనలు తుంగలోకి తొక్కి సోషల్ మీడియా ప్రచారం
- వెలగపూడికి ఓటేయాలంటూ ఓటర్లకు ప్రలోభాలు

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 18వ వార్డుకు చెందిన ఓ టీడీపీ నాయకుడు అత్యుత్సాహం ప్రదర్శించాడు. ఎన్నికల నియమావళి పక్కన పెట్టి ఎంవీపీ కాలనీ అప్పుఘర్‌కు చెందిన టీడీపీ నాయకుడు పోలవరపు అప్పారావు సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సోమవారం ఉదయాన్నే సమత కళాశాల పోలింగ్ స్టేషన్‌కు వెళ్లి టీడీపీ అభ్యర్థి వెలగపూడికి ఓటు వేశానని ప్రచారం చేశారు. 48 గంటల ముందు నుంచి ప్రచారం నిలిపేయాలనే కచ్చితమైన నిబంధన ఉంది. అయితే టీడీపీకి ఓటు వేశానని సిరా ఇంకుతో కూడిన వేలు చూపు సోషల్ మీడియాలో పోస్టు పెట్టి ఆయన నిబంధనలు ఉల్లంఘించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అప్పారావుపై చర్యలు తీసుకోవాలని ఇతర పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎన్నికల అధికారులకు సైతం ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.




సిరా ఇంకు వేలు చూపుతున్న టీడీపీ నేత

తోపులాటతో ఉద్రిక్తం

- టీడీపీ–జనసేన, వైఎస్సార్‌సీపీ నాయకుల మధ్య ఘర్షణ
- ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి కారు అడ్డగింత
- డీసీపీ రాకతో సద్దుమణిగిన వ్యవహారం

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డు సైలాడ పైడితల్లి కల్యాణ మండపం 77వ పోలింగ్ బూత్ వద్ద టీడీపీ–జనసేన, వైఎస్సార్‌సీపీ నాయకుల మధ్య వాగ్యుద్ధం, తోపులాట జరిగింది. పోలింగ్ సమయం ముగిసిపోవడం పోలీసులు బయట గేట్లు మూసివేశారు. అయితే అక్కడే ఉన్న టీడీపీ–జనసేన నాయకులు బయట ఉన్న కొందరు ఓటర్లను లోపలికి పంపించి ఓట్లు వేయించే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు దీనిని అడ్డుకున్నారు. దీంతో టీడీపీ–జనసేన, వైఎస్సార్‌సీపీ నాయకుల మధ్య ఘర్షణ చెలరేగింది. ఒకరినొకరు తోసుకున్నారు. సుమారు గంటసేపు ఈ హడావుడి కొనసాగింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ అటుగా వచ్చారు. దీంతో టీడీపీ–జనసేన నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వాసుపల్లి కారుకు అడ్డంగా నిల్చుని ముందుకెళ్లకుండా అడ్డగించారు. విషయం తెలుసుకున్న డీసీపీ సత్తిబాబు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.



వాసుపల్లి కారును చుట్టుముట్టిన వారిని చెదరగొడుతున్న పోలీసులు



యువసైన్యం ఓటేసింది



యువోత్సాహం

విశాఖ సిటీ: వృద్ధులు, మహిళలతో పాటు యువతీ, యువకులు సైతం ఉత్సాహంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ముఖ్యంగా గత ఎన్నికల కంటే అత్యధిక సంఖ్యలో యువ ఓటర్లు ఈసారి ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఉన్నత విద్య, ఉద్యోగాల నిమిత్తం ఇతర రాష్ట్రాల్లో ఉన్న వారు సైతం ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఆసక్తి చూపించారు. పోలింగ్ కేంద్రాల్లో ఉత్సాహంగా స్నేహితులతో కలిసి కూలైన్లలో నిలబడి సందడి చేశారు. కొన్ని మోడల్ పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సెల్ఫీ స్టాండ్స్ వద్ద సెల్ఫీలు దిగారు. అలాగే తొలిసారిగా తమ చూపుడు వేలుకు అంటిన సిరా చుక్కతో సెల్ఫీ తీసుకొని సోషల్ మీడియాలో పెట్టుకొని సంబరపడ్డారు.









నేను ఓటు వేశానోచ్.

సిరా గుర్తు.. ప్రగతికి మెట్టు

హెలికాప్టర్‌లో ఈవీఎంల తరలింపు



సొంతంగా ఏర్పాటు చేసుకున్న వాహనాల్లో ఓటు వేసేందుకు వెళ్తున్న జి.మాడుగుల మండలం కిల్లంకోట గిరిజనులు



రంపచోడవరంలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించేందుకు హెలికాప్టర్ నుంచి ఈవీఎంలను దించుతున్న సిబ్బంది

మారేడుమిల్లి: మావోయిస్టు ప్రభావిత ఏజెన్సీ ప్రాంతంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్నికల కమిషన్ ఏర్పాట్లు చేపట్టింది. ఈవీఎంలు, ఎన్నికల సిబ్బంది తరలింపు కోసం రెండు హెలికాప్టర్‌లను ఉపయోగించారు. అల్లూరి జిల్లా రంపచోడవరం నియోజకవర్గం వై.రామవరం మండలంలో సమస్మాత్మక ప్రాంతమైన గుర్తేడుకు హెలికాప్టర్ సాయంతో ఈవీఎంలను, సిబ్బందిని తీసుకెళ్లారు. ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని, తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు పోలింగ్ ముగిసింది. అనంతరం భద్రత నడుమ హెలికాప్టర్‌లో ఈవీఎంలను రంపచోడవరం స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. గుర్తేడు, పాతకోట రెండు పంచాయతీల్లోని ఆరు బూత్‌లకు గాను 4,463 మంది ఓటర్లు ఉండగా, 2,048 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: వేసవి సీజన్ దృష్ట్యా, ఎన్నికల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక రైళ్ల వివరాలిలా..



- ఎస్ఎంవీటి బెంగళూరు–ఖుర్దారోడ్(06253) సమ్మర్ స్పెషల్ ఈ నెల 21వ తేదీ రాత్రి 11 గంటలకు బెంగళూరులో బయల్దేరి మరుసటి రోజు సాయంత్రం 5.48 గంటలకు దువ్వాడ చేరుకుని, 5.50 గంటలకు బయల్దేరి 23న ఉదయం 11 గంటలకు ఖుర్దారోడ్ చేరుకుంటుంది.
- తిరుగు ప్రయాణంలో ఖుర్దారోడ్–ఎస్ఎంవీటీ బెంగళూరు(06254) స్పెషల్ రైలు ఖుర్దారోడ్‌లో 23వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు బయల్దేరి మరుసటి రోజు తెల్లవారు 4.58 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 5 గంటలకు బయల్దేరి 24న రాత్రి 10.40 గంటలకు బెంగళూరు చేరుకుంటంది.
- విశాఖపట్నం–సికింద్రాబాద్ (08589) స్పెషల్ ఈ నెల 14వ తేదీ సాయంత్రం 4.15 గంటలకు బయల్దేరి మునటి రోజు ఉదయం 6.15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.
- తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్–విశాఖపట్నం(08590) స్పెషల్ సికింద్రాబాద్‌లో ఈ నెల 15న బుధవారం ఉదయం 10.30 గంగటలకు బయల్దేరి అదే రోజు రాత్రి 11.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

పలు రైళ్ల రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): ఆయా ప్రాంతాల నుంచి గమ్యస్థానాలకు చేరుకోవలసిన పెయిరింగ్ రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నందున విశాఖపట్నం, శ్రీకాకుళం స్టేషన్‌ల నుంచి పలు రైళ్లు ఆలస్యంగా బయల్దేరుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

- విశాఖలో సోమవారం రాత్రి 7.10 గంటలకు బయల్దేరవలసిన విశాఖపట్నం–తిరుపతి(08583) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ సుమారు 4 గంటలు ఆలస్యంగా రాత్రి 11.20 గంటలకు బయల్దేరింది.
- శ్రీకాకుళం రోడ్‌లో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరవలసిన శ్రీకాకుళం రోడ్–తిరుపతి(07441) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ సుమారు 14 గంటలు ఆలస్యంగా మంగళవారం ఉదయం 5.30 గంటలకు బయల్దేరింది.
- విశాఖలో సోమవారం రాత్రి 11.20 గంటలకు బయల్దేరవలసిన విశాఖపట్నం–లోకమాన్య తిలక్ టెర్మినస్ (18519) ఎక్స్‌ప్రెస్ సుమారు గంట ఆలస్యంగా మధ్య రాత్రి 12.30 గంటలకు బయల్దేరింది.
- విశాఖలో సోమవారం మధ్యాహ్నం 2.35 గంటలకు బయల్దేరవలసిన విశాఖపట్నం–సికింద్రాబాద్ (20708) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సుమారు 3 గంటలు ఆలస్యగా సాయంత్రం 5.45 గంటలకు బయల్దేరింది.
- విశాఖలో సోమవారం మధ్య రాత్రి 12.25 గంటలకు బయల్దేరవలసిన విశాఖపట్నం–అమృత్‌సర్ (20807) హిరాకుడ్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రెండు గంటలు ఆలస్యంగా మంగళవారం తెల్లవారు 2.25 గంటలకు బయల్దేరుతుంది.